క్లుప్తంగా

పన్ను వసూళ్లలో గిద్దలూరుకు రెండో స్థానం

గిద్దలూరు రూరల్: ఆస్తి పన్ను వసూళ్లలో జిల్లాలోనే గిద్దలూరు నగర పంచాయతీ రెండో స్థానంలో నిలిచింది. 2024–25 ఆర్థిక సంవత్సరానికిగాను నగర పంచాయతీలోని అన్ని రకాల ఆస్తి పన్నులు రూ.4.67 కోట్లు వసూలు కావాల్సి ఉండగా రూ.3.42 కోట్లు ఖజానాకు జమయ్యాయని కమిషనర్ ఐ.శ్రీనివాసులు మంగళవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. 73.37 శాతం వసూళ్లతో రాష్ట్రంలోనే 17వ స్థానంలో గిద్దలూరు నగర పంచాయతీ నిలిచిందని తెలిపారు. గత ఏడాది కంటే రూ.38 లక్షలు అధికంగా పన్ను వసూలు చేసినట్లు పేర్కొన్నారు. పన్ను వసూళ్లలో నిరంతరం శ్రమించిన మున్సిపల్ సిబ్బంది టపావలి, ఆదిరెడ్డి, బీవీ రంగారావును అభినందించారు.

కేజీబీవీలో 11 వరకు దరఖాస్తుల స్వీకరణ

కొనకనమిట్ల: మండలంలోని గొట్లగట్టు కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో ప్రవేశానికి ఈ నెల 11వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ రాఘవ సురేఖ తెలిపారు. 2025–26 సంవత్సరంలో 6వ తరగతి, ఇంటర్ ఫస్ట్ ఇయర్(ఎంపీసీ)లో ప్రవేశానికి అర్హులైన విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ సూచించారు. ఆరో తరగతిలో 40, ఇంటర్ ఫస్ట్ ఇయర్‌లో 40 సీట్లు ఉన్నాయని వెల్లడించారు. మిగిలిన తరగతులకు సంబంధించి ఖాళీలను బట్టి దరఖాస్తులుకు అనుమతిస్తామని స్పష్టం చేశారు. అనాథలు, బడిబయట పిల్లలు, డ్రాపౌట్స్, పేద, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, బీపీఎల్ బాలికలు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. వివరాలకు.. 8500723716, 8897710857ను సంప్రదించాలని సూచించారు.

గడప దాటని గింజ!

గిట్టుబాటు ధరపై మెట్టు దిగిరాని సర్కారు

- ఇళ్లలోనే మగ్గుతున్న మినుములు, అలసందలు, కందులు
- వ్యాపారుల సిండికేట్‌తో మరింత దిగజారిన ధరలు
- నాణ్యతపై సాకులు.. నాసిరకమంటూ మెలికలు
- పెట్టుబడి సొమ్ము చేతికొస్తే చాలన్న ఆశతో రైతులు



గొట్లగట్టులో ఇంట్లో నిల్వ చేసిన అలసందలు, మినుములు



మంగాపురంలో ఇంట్లో మగ్గుతున్న కందులు

కొనకనమిట్ల:

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అన్నదాతల గోడు పట్టించుకునేవారే కరువయ్యారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో గిట్టుబాటు ధరలు కల్పించి, సకాలంలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడంతో రైతులు సంతోషించారు. కానీ నేడు ఆ పరిస్థితి కరువైంది. రైతులు పండించిన ధాన్యం కొంత మేర అమ్మకాలు జరిగినప్పటికీ ఇటీవల మార్కెట్ ధరలు లేక, కొనేవారు ముఖం చాటేయటంతో పలు చోట్ల మినుము, అలసంద, కందులు ఇళ్లలోనే మగ్గుతున్నాయి. మరో వైపు దళారుల దోపిడీతో కనీసం పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదని అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు. గతంలో కన్నా ఈ ఏడాది సాగు ఖర్చులు పెరిగిన నేపథ్యంలో పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలని రైతులు కోరుతున్నారు. కొనకనమిట్ల మండలంలో మినుము, అలసంద, కంది తదిర మెట్ట పైర్లు అధిక విస్తీర్ణంలో సాగు చేశారు. అలసంద, మినుము పంటలు సుమారు 15 వేల ఎకరాలకు పైగా, కంది 15 వేల ఎకరాలకు పైగా సాగు చేశారు. అలసంద ఎకరాకు 3 నుంచి 4 క్వింటాళ్ల వరకు, మినుము 2 నుంచి 3 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చింది. కంది పంట ఓ రకంగా దిగుబడి వచ్చినప్పటికీ ఆశించిన ధర లేక ఇళ్లలోనే మూలుగుతున్నాయి. గత డిసెంబర్ నెలలో కురిసిన వర్షాలకు పంట కొంతమేర దెబ్బతినడంతో పంట నాణ్యతపై సాకులు చెబుతూ తక్కువ ధరకు అడుగుతున్నారు. నాణ్యమైన అలసందలు క్వింటా ధర గత నెలలో రూ.6500 వరకు, మినుముల ధర రూ.7 వేల వరకు పలికింది. ప్రస్తుతం అలసందలు రూ.4,500 నుంచి రూ.5 వేలకు, కందులు రూ.7500 వరకు కొనుగోలు చేస్తున్నారు. దీంతో పెట్టుబడి కూడా చేతికి రాదని, నష్టాలు తప్పవని రైతులు గగ్గోలు పెడుతున్నారు. రైతు శ్రమను గుర్తించి మద్దతుగా నిలవాల్సిన ప్రభుత్వం పంటకు గిట్టుబాటు ధర కలిపించకుండా చోద్యం చూస్తోంది. కందులు కొనుగోలు చేస్తామని కొనుగోలు కేంద్రాలు ప్రకటించిన ప్రభుత్వం మద్దతు ధరను రూ.7550కి పరిమితం చేయడంతో రైతులు నిరాశకు గురయ్యారు. గతేడాది రూ. 9 వేల వరకు పలికిన కందుల ధరను ఈ ఏడాది ప్రభుత్వమే కుదించడాన్ని రైతులు జీర్ణించుకోలేకపోతున్నారు. ఇటీవల వరకు అలసంద, మినుము, కందులకు మార్కెట్ ధర బాగానే ఉన్నప్పటికి వ్యాపారులు కుమ్మక్కై ధర పెరగనివ్వకుండా రూ.6 వేల లోపే కొనుగోలు చేశారు.

గిట్టుబాటు ధరలేక ఇళ్లలో నిల్వ



రైతులు పండించిన పంటలకు సరైన మార్కెట్ ధరలు లేక ఇళ్లలోనే నిల్వ ఉంచారు. మినుములు, అలసందలు, కందులు పండించిన రైతులకు ఈ ఏడాది నష్టాలు తప్పేలా లేవు. ప్రభుత్వం రైతుల గురించి పట్టించుకోవాల్సిన అవసరం ఉంది. ఆరుగాలం శ్రమించి పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లేకపోవటంతో పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదు. ప్రభుత్వం కొనకనమిట్ల మండలాన్ని కరువు మండలంగా ప్రకటించడంతో రైతులను ఆదుకుంటారని ఆశగా ఎదురుచూస్తున్నారు.

– పి.నారాయణరెడ్డి, రైతు, గొట్లగట్టు



తక్కువ ధరకే వ్యాపారులు కొనుగోలు చేసిన ధాన్యం కాటా వేస్తున్న కూలీలు

నవోదయ ఫలితాలు విడుదల

తర్లుపాడు: మండలంలోని కలుజువ్వలపాడు పీఎం జవహార్ నవోదయ విద్యాలయలో 6, 9వ తరగతి ప్రవేశ ఫలితాలను మంగళవారం ప్రకటించారు. 9వ తరగతి ప్రవేశానికి ఎంపికైన విద్యార్థులు 3వ తేదీ ఉదయం 9.30 గంటలకు, 6వ తరగతికి ఎంపికైన విద్యార్థులు 5వ తేదీ ఉదయం 9.30 గంటలకు తమ హాల్ టికెట్లతో పాఠశాలకు రావాలని ప్రిన్సిపల్ గణేష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఫలితాలను www.navodaya.gov.in వెబ్‌సైట్‌లో చూడవచ్చని పేర్కొన్నారు.

రహదారి నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు



వాహనదారులకు కౌన్సెలింగ్ ఇస్తున్న కంభం సీఐ

కంభం: నిబంధనలు ఉల్లంఘించి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని కంభం సీఐ మల్లికార్జున హెచ్చరించారు. స్థానిక వైజంక్షన్‌లో మంగళవారం సాయంత్రం వాహనాలు తనిఖీ చేసి కౌన్సెలింగ్ ఇచ్చారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. మద్యం తాగి వాహనాలు నడుపుతూ పోలీసులకు పట్టుబడితే కఠిన చర్యలు తప్పవన్నారు. చిన్నపిల్లలకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. రోజూ వాహన తనిఖీలతో పాటు డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు నిర్వహిస్తామని, వాహనదారులు తప్పనిసరిగా రోడ్డు భద్రతా నియమాలు పాటించాలన్నారు.

ఆప్కాస్ రద్దుతో ఉద్యోగ భద్రతకు ముప్పు

- ఆప్కాస్ రద్దుపై మంత్రి వర్గ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి
- ఏజెన్సీలను రంగంలోకి దించితే మొదటికే మోసం
- నిరసన ర్యాలీల్లో సీఐటీయూ నాయకులు
- కార్మికులను పర్మినెంట్ చేశాకే ఆప్కాస్ రద్దు చేయాలని డిమాండ్



మార్కాపురంలో నిరసన ర్యాలీలో పాల్గొన్న మున్సిపల్ కార్మికులు

మార్కాపురం: ఔట్‌సోర్సింగ్ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించడంతోపాటు ఠంచనుగా వేతనం అందించేందుకు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఆప్కాస్ వ్యవస్థను యథావిధిగా కొనసాగించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి డీకేఎం రఫీ డిమాండ్ చేశారు. మంగళవారం మార్కాపురంలో మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డీకేఎం రఫీ మాట్లాడుతూ.. ఆప్కాస్‌ను రద్దు చేస్తే చిరుద్యోగుల జీవనాధారానికి ముప్పు వాటిల్లుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం గత ఫిబ్రవరి 6వ తేదీన నిర్వహించిన మంత్రివర్గ సమావేశంలో ఆప్కాస్ రద్దుపై తీసుకున్న నిర్ణయాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్మికులను పర్మినెంట్ చేసిన తర్వాత ఆప్కాస్ రద్దు విషయంపై ఆలోచించాలన్నారు. ఆప్కాస్ స్థానంలో మళ్లీ ప్రైవేట్ ఏజెన్సీలను నియమిస్తామని కూటమి ప్రభుత్వ ప్రకటించడంతో ఔట్‌సోర్సింగ్ కార్మికుల్లో ఆందోళన నెలకొందన్నారు. ఆప్కాస్ ఏర్పాటు కాకముందు మున్సిపాలిటీ రంగంలో ప్రతి సెక్షన్‌కు దళారీ వ్యవస్థ ఉండేదన్నారు. జీతభత్యాల చెల్లింపు ఏజెన్సీల దయాదాక్షిణ్యాల మీద ఆధారపడి ఉండేదని, నెలల తరబడి వేతనం చెల్లించకుండా బకాయి పెట్టేవారని గతాన్ని గుర్తు చేశారు. కార్మికుల బ్యాంకు పాసు పుస్తకాలు సైతం ప్రైవేట్ ఏజెన్సీల దగ్గరే ఉండేవన్నారు. ఈ దళారీ వ్యవస్థకు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చరమగీతం పాడిందని, ప్రభుత్వమే మధ్యవర్తి పాత్ర పోషించేలా ఆప్కాస్ వ్యవస్థకు రూపకల్పన చేసిందని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం తమను పర్మినెంట్ చేస్తుందనే ఆశతో కాంట్రాక్టు కార్మికులందరూ ఎదురు చూస్తున్నారన్నారు. కార్మికులకు వ్యతిరేకంగా వ్యవహరిస్తే పెద్ద ఎత్తున ఉద్యమిచ్చేందుకు సిద్ధమని హెచ్చరించారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు సుబ్బరాయుడు, హరికృష్ణ, ఇమాంసా, చెన్నకేశవులు తదితరులు పాల్గొన్నారు.

పొదిలి: ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్, సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం పొదిలిలో కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పొదిలి నగర పంచాయతీ కమిటీ కార్యదర్శి బి.కోటేశ్వరరావు మాట్లాడుతూ.. ఆప్కాస్‌ను రద్దు చేసి ప్రైవేటు ఏజన్సీలను నియమిస్తామని కూటమి ప్రభుత్వం ప్రకటించడాన్ని తప్పుబట్టారు. దళారీ వ్యవస్థను రంగంలోకి దించితే ఉద్యోగాలకు భద్రత లేకుండా పోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్మికులకు భరోసా కల్పించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. కార్మికుల భద్రతకు ముప్పు తలపెడితే ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు దార్ల సుబ్బయ్య, సభ్యులు నాగేశ్వరరావు, నరసింహం, కుమార్, కల్యాణ్, రాజయ్య, కోటేశ్వరమ్మ, నాగేంద్రం తదితరులు పాల్గొన్నారు.

ఔట్ సోర్సింగ్‌లో ప్రైవేట్ ఏజెన్సీలొద్దు

గిద్దలూరు రూరల్: మున్సిపల్ ఔట్ సోర్సింగ్ కార్మికులను ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పగించవద్దంటూ సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక నగర పంచాయతీ కార్యాలయం ఎదుట కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకుడు టి.ఆవులయ్య మాట్లాడుతూ.. ఆప్కాస్ రద్దు ఆలోచనను విరమించుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పగిస్తే వేతనం సక్రమంగా ఇవ్వకపోగా పీఎఫ్ సైతం చెల్లించే పరిస్థితి ఉండదన్నారు. గత సమ్మె కాలపు ఒప్పందాలను అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్మికులు మురళి, పాపయ్య, చంటయ్య, రంగయ్య, రవి, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.



పొదిలిలో ధర్నా చేస్తున్న నగర పంచాయతీ కార్మికులు



గిద్దలూరులో నగర పంచాయతీ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న కార్మికులు

పాస్టర్ ప్రవీణ్ మృతిపై దుష్ప్రచారం హేయం

- ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు షాలెంరాజు
- అర్ధవీడులో శాంతియుత ర్యాలీ



అర్ధవీడులో ర్యాలీ నిర్వహిస్తున్న ప్రజాసంఘాల నాయకులు

అర్ధవీడు(కంభం): పాస్టర్ ప్రవీణ్ పగడాల అనుమానాస్పద మృతిపై సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేస్తున్న వ్యక్తులపై రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాసుగంటి షాలెంరాజు డిమాండ్ చేశారు. మండల కేంద్రమైన అర్ధవీడులో మంగళవారం క్రైస్తవ సంఘాల ఆధ్వర్యంలో శాంతియుత ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా షాలెంరాజు మాట్లాడుతూ.. ప్రవీణ్ పగడాల మృతి హత్యా లేక రోడ్డు ప్రమాదమా అని నిర్ధారించుకోడానికి ప్రభుత్వానికి, పోలీసులకు ఏడు రోజులు సరిపోలేదా అని ప్రశ్నించారు. పాస్టర్ మృతికి సంబంధించి ఎలాంటి విషయాలు తెలిసినా మీడియాలో, సోషల్ మీడియాలో పెట్టకూడదని పోలీసు ఉన్నతాధికారులు ఆదేశించినా కొన్ని మీడియా సంస్థలు, సోషల్‌మీడియాలో కట్టుకథలు అల్లి దుష్ప్రచారం చేయడం దారుణమని, వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. మైనారిటీలు, క్రైస్తవులు గొంతెత్తి ప్రశ్నించలేరన్న ఉద్దేశంతోనే మతోన్మాద శక్తులు దాడులకు తెగబడుతున్నాయన్నారు. ఇలాంటి సంఘటనలు జరిగినప్పుడు చట్టం, పోలీసులు నిష్పక్షపాతంగా విచారణ చేపట్టి నిందితులను శిక్షించాల్సిన అవసరముందన్నారు. సోషల్ మీడియాలో రాజకీయ నేతల తప్పులను ప్రశ్నిస్తూ పోస్టులు పెడితే రాత్రికి రాత్రే ఎత్తుకుపోయే పోలీసులు పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతిపై దుష్ప్రచారం చేస్తుంటే ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని నిలదీశారు. ప్రవీణ్ హత్య కేసును ఛేదించి ఉంటే రాష్ట్ర వ్యాప్తంగా క్రైస్తవులు, విశ్వాసులు రోడ్లపైకి వచ్చి ర్యాలీలు చేయాల్సిన పరిస్థితి వచ్చి ఉండేది కాదన్నారు. ఇప్పటికైనా నిజమేంటో నిగ్గు తేల్చాలని పోలీసులను కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు నేదరపల్లి జయరాజ్, బొడిచెర్ల రాజు, షీలా, క్రైస్తవ, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ముగిసిన టెన్త్ పరీక్షలు



కొమరోలులో పరీక్ష రాసి బయటకు వస్తున్న విద్యార్థులు



గొట్లగట్టులో సందడి చేస్తున్న కేజీబీవీ బాలికలు

బేస్తవారిపేట: పదో తరగతి పబ్లిక్ పరీక్షలు మంగళవారంతో ప్రశాంతంగా ముగిశాయి. బేస్తవారిపేట మండలంలోని పిటికాయగుళ్ల, బేస్తవారిపేట జెడ్పీ బాలుర, బాలికల హైస్కూళ్లలో చివరిరోజు పరీక్షను తహసీల్దార్ జితేంద్రకుమార్, ఎంఈఓ సీహెచ్ రమణారెడ్డి తనిఖీ చేశారు. సోషల్ పరీక్షకు బేస్తవారిపేట బాలుర హైస్కూల్లో 142 మంది విద్యార్థులకుగాను 141, బాలికల హైస్కూల్లో 190కి 190, పిటికాయగుళ్ల హైస్కూల్లో 139 మందికి 138 మంది విద్యార్థులు హాజరైనట్లు ఎంఈఓ తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద ఎస్సై ఎస్వీ రవీంద్రారెడ్డి తమ సిబ్బందితో కలిసి బందోబస్తు నిర్వహించారు.

కొమరోలు: కొమరోలులోని 3 పరీక్ష కేంద్రాల్లో సోషల్ పరీక్షకు 446 మంది విద్యార్థులకుగాను ఇద్దరు గైర్హాజరైనట్లు ఎంఈఓ బి.వెంకటరత్నం తెలిపారు. 3 పరీక్ష కేంద్రాలను ఫ్లయింగ్ స్క్వాడ్ బి.వెంకారెడ్డి తనిఖీ చేశారు.

కొనకనమిట్ల: మండలంలోని గొట్లగట్టు హైస్కూల్లో 210 మంది విద్యార్థులు, పెదారికట్లలో 130 మంది, మర్రిపాలెం కేంద్రంలో 120 మంది, వెలుగొండ గురుకుల పాఠశాలలో 170 మంది విద్యార్థులు సోషల్ పరీక్షకు హాజరయ్యారు. పరీక్ష కేంద్రాల వద్ద ఎస్సై రాజ్‌కుమార్ తమ సిబ్బందితో కలిసి బందోబస్తు నిర్వహించారు. కాగా ప్రశాంతంగా పరీక్షలు ముగియడంతో విద్యార్థులు సందడి చేశారు.

మంచినీళ్లనూ వదలని మాయగాళ్లు



ఆర్‌ఓ ప్లాంటును ప్రారంభిస్తున్న అప్పటి ఎమ్మెల్యే కేపీ(ఫైల్)



ఆర్‌ఓ ప్లాంట్

తర్లుపాడు: కూటమి ప్రభుత్వంలో తెలుగు తమ్ముళ్ల బరితెగింపు శృతి మించుతోంది. గత వైఎస్సార్ సీపీ పాలనలో నాటి మార్కాపురం ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి 10 లక్షల రూపాయల ప్రభుత్వ నిధులు వెచ్చించి మండల కేంద్రమైన తర్లుపాడులో ఏర్పాటు చేసిన ఆర్‌ఓ వాటర్ ప్లాంటును ఓ టీడీపీ నేత తన ఆధీనంలో ఉంచుకున్నాడు. పంచాయతీకి దక్కాల్సిన ఆదాయాన్ని అప్పనంగా దిగమింగుతున్నాడు. మంచి నీరు తాగినంత సులువుగా సదరు టీడీపీ నేత అక్రమానికి పాల్పడిన తీరు చూసి తర్లుపాడు ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు. వివరాల్లోకి వెళ్తే.. మండల కేంద్రమైన తర్లుపాడులోని గాంధీ పార్కులో నాటి మార్కాపురం ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి తన ఫండ్స్ నుంచి రూ.10 లక్షలు ఖర్చు చేసి ఆర్వో ప్లాంటు ఏర్పాటు చేశారు. 2024 ఫిబ్రవరిలో ఆర్వో ప్లాంటును పూర్తి చేసి, నిర్వహణ బాధ్యతలను పంచాయతీకి అప్పగించారు. 20 లీటర్ల నీటిని కేవలం 5 రూపాయలకు మాత్రమే వసూలు చేయాలని, ఆ డబ్బును ప్లాంటు నిర్వహణకు, మరమ్మతులకు, విద్యుత్ బిల్లులకు ఖర్చు చేసి మిగిలిన ఆదాయాన్ని పంచాయతీకి జమ చేయాలని తీర్మానం చేశారు. అనుకోని రీతిలో అధికార మార్పిడి జరగగానే ఒక టీడీపీ నేత సదరు ఆర్‌ఓ ప్లాంటుపై కన్నేసి తన స్వాధీనంలోకి తీసుకున్నాడు. రోజుకు సుమారు 250 బబుల్స్‌కు పైగా నీటిని విక్రయిస్తూ ఆదాయాన్ని తన జేబులో వేసుకుంటున్నాడు. ప్రస్తుతం ప్లాంటు నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. పంచాయతీ అధికారులు జోక్యం చేసుకుని ఆర్‌ఓ వాటర్ ప్లాంటు నిర్వహణకు పంచాయతీ తరఫున టెండర్లు పిలవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

పశువుల నీటి తొట్లకు భూమి పూజ



సర్విరెడ్డిపల్లెలో నీటితొట్టి నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎంపీడీఓ

కొమరోలు: మండలంలోని సర్విరెడ్డిపల్లె గ్రామంలో పశువుల నీటి తొట్టి నిర్మాణానికి ఎంపీడీఓ మస్తాన్‌వలి మంగళవారం భూమి పూజ నిర్వహించారు. ఎండీడీఓ మాట్లాడుతూ.. మండలంలో 28 పశువుల నీటి తొట్లను పశుసంవర్ధకశాఖ ద్వారా ఎంపిక చేసినట్లు తెలిపారు. ఉపాధి హామీ పథకం నిధులతో తొట్లను ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఒక్కో నీటి తొట్టి నిర్మాణానికి ప్రభుత్వం రూ.33 వేలు మంజూరు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీఓ మహాలక్ష్మి, జేఈ కోటిరెడ్డి, టీఏలు శ్రీనివాసులు, లక్ష్మీరెడ్డి పాల్గొన్నారు.

రోడ్లు వేయాలి.. కాలువలు తీయాలి

మార్కాపురం టౌన్: పూలసుబ్బయ్య కాలనీలోని ఎస్టీ, జంగాల వీధుల్లో సీసీ రోడ్లు, డ్రెయినేజీలు నిర్మించాలని స్థానికులు కోరారు. మంగళవారం బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీ కృష్ణారావు స్థానిక నాయకులతో కలిసి కాలనీలో పర్యటించారు. సమస్యలు తెలియజేస్తే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని చెప్పగా కాలనీ వాసులు పైవిధంగా స్పందించారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు పాదర్తి ఆంజనేయులు, నాయకులు సతీష్, రామకృష్ణ, గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.